
# సినిక్

భమిడిపాటి రామగోపాలం



శకుంతలనందరూ "సినిక్" అంటారు.

"సినిక్‌నే" అని చిరునవ్వు నవ్వుకుంటుంది శకుంతల "సినిక్సు ప్రేమించినంతగా వీక్‌నెసెస్‌ని ఎవ్వరూ ప్రేమించరు. అందుకే మీకు సినిక్సంటే యిష్టం." అని మనస్సులో అనుకుంటుంది.

తన కంపెనీ అందరికీ కావాలి తను అందర్లాగా జోక్స్ వెయ్యదు. పొడిపొడిగా మాట్లాడుతుంది. కాని వుషారుతో బరువెక్కిపోతున్న లేడీ ఫ్రెండ్సుకి శకుంతల నవ్వేలాంటి సినికల్‌లాఫ్స్ అప్పుడప్పుడూ లేకపోతే తేలిగ్గా తేలిపోయే ఆ నవ్వుల్తో ప్రాణం కడబట్టిపోతుంది.

* * *

రెండు బస్సులుమారి రాజీ ఇంటికి వెళ్ళింది శకుంతల. అయిదు గంటలకింకా అయిదు నిమిషాలుందనగానే ఆఫీసు లోంచి ఇవతలబడ్డది. అయినా బస్సులు రద్దీగా వున్నాయి.

'పేరుకి మాత్రం లేడీస్ ఫస్ట్ అంటారు. కాని బస్సులు ఎక్కే సమయానికి మొగజన్మ ఎత్తినవాడెవడూ అది పాటించడు. ఏదో కుట్రచేస్తున్నట్టు అందరూ ఓ గుంపుగా తయారైపోయి వాళ్ళలో వాళ్ళే కుమ్ములాడీసుకుంటారు. ఇంక ఆడవాళ్ళేం చేస్తారు; మమ్మేలిన వారిజాతి, మా మొగజాతి ఇటువంటిది కదా అని సిగ్గుపడి వూరుకుంటారు' అనుకుంది శకుంతల.

"నాకెవరిమీదా మంచభిప్రాయం ఉండదు 'సినిక్'ని కదా నేను" అనుకొని నవ్వుకొంది; వెంటనే.

సాయంకాలం నాలుగు కాకముందే శకుంతల సీటు దగ్గర కొచ్చింది రాజీ - "సినిమాకి పోదాంవే-" అంది. "నీకేం పోయింది తల్లీ, మంచి సెక్షన్లోపడ్డావు, సినిమాల కెళతావు. షికార్ల కెళతావు" అన్నాది శకుంతల. "యూ, సినిక్ !" శకుంతల మాట్లాడలేదు

రాజీ ఇబ్బందిలో పడ్డాది. సెక్షన్లో మిగిలిన వాళ్ళంతా పనులు మానేసి తన వేపు చూస్తున్నారు.

"అబ్బ, పోదాం పదవే, మా సూపరెంటు నన్ను పొమ్మన్నాడే, నువ్వూ అడిగొచ్చీవే; ఇద్దరం పోదాం, చక్కానూ", అని మళ్ళీ గుసగుసలాడింది.

"మిస్ శకుంతలా ! ఈ రిజిస్టర్లో ఎంట్రీలు మూడు రోజుల్నించీ ఇలాగే ఉండిపోయాయి" సూపరెంటు పలకరింపుతో అటు చూసింది శకుంతల.

"చేసేస్తాను సార్" అన్నది శకుంతల, అణకువ వుట్టిపడుతూ.

పక్కసీట్లో వృద్ధ్రవాయసకాడు అదే, ఓల్డు క్లర్కు నరసింగరావు "ఏమిటమ్మా. ఏదేనా సినిమా ప్రోగ్రామా ? తొందరపడుతున్నట్లున్నారూ ?" అని పలకరించేడు.

"అవునండీ" అని చెప్పింది రాజీ ; మా అమ్మ చచ్చిపోయిందండీ-అన్నంత జాలిగా.

సూపరెంటు ఇచ్చిన రిజిస్టరు అతనే అందుకున్నాడు "ఇప్పుడే వస్తానని చెప్పేసి వెళ్ళిపోవమ్మా, రిజిస్టరుదేముంది; నే రాసిపెడతాలే."

"మరి కదులూ" అంది రాజీ.

"అబ్బ ! నే రానే, వీళ్ళు ఇలాగే ఆఫర్స్ చేస్తారు. నాకీ ఆబ్లిగేషన్లంటే చిరాకు" అన్నది శకుంతల.

"అబ్బబ్బ ! అంతంత మాటలెందుకే."

కాని శకుంతల-సిరికింజెప్పక, శంఖ చక్రయుగముం జేదోయి సంధింపక -

బయల్దేరలేదు. టిఫిన్ బాక్స్, చదువు కొనే పుస్తకం, చిన్న వేనిటీ బేగ్, ఇన్నోటుంటాయి. అవన్నీ సందిట సంధించుకొనేలోగా ఆ సూపరెంటు ఆమె పలాయనాన్ని పసిగట్టి, "ఆయన చేసే పనులు ఆయనకున్నాయి. రిజిస్టరు ఆయన రాయడానికి వీల్లే"దంటూ అడ్డు పడ్డాడు.

"నే చెప్పేను కదే – వీళ్ళలో వీళ్ళకి సవితి పెళ్ళాలకున్నంతలేసి అసూయలే. ఈ ముసిలాడు ఎక్కడ ఛాన్సు కొట్టేస్తాడోనని ఆ సైంధవుడికి గుబ్బు" అన్నది శకుంతల.

''అబ్బబ్బ! నీ సినికల్ రిమార్కులూ నువ్వూను'' అని రాజీ విసుక్కుంది.

"అయిదున్నరకల్లా మీ గుమ్మంలో ఉంటానే తల్లీ. పోదూ! చూసేవుగా, కాపరం!" అని నవ్వూ దుఃఖం జోడించి చెప్పింది శకుంతల

ఆరుగంటలైపోతున్నది.

* * *

"రాజీ!" తలుపు కొట్టింది శకుంతల. జవాబు లేదు.

అది లోపలివాటా. కారిడార్లో ఎవరూ లేరు, లేరు కదా అని అటూ ఇటూ మరో మాటుచూసి, తాళం కన్నంలోంచి లోపలికి తొంగిచూసింది శకుంతల.

ఆశ్చర్యం!

రాజీ లోపలే ఉన్నాది. నిద్దరేనా పోవడంలేదు.

కుర్చీలో కూచుని కాళ్ళు రెండూ పెద్ద మొగాళ్ళాగ టేబిలుమీద పడేసి తేలిగ్గా అటూ ఇటూ వూగుతున్నది. కాళ్ళకింద నుంచి వేలాడే చీరకుచ్చెళ్ళు విలాసంగా ఊగుతూవుంటే ఎంతసేపైనా చూడాలనిపిస్తోంది శకుంతలకి. రాజీ కళ్ళు చిన్నగా నవ్వుకుంటూ ఏదో కాయితాన్ని అప్యాయంగా చదువుతున్న దృశ్యాన్ని తనివితీరా చూస్తూ "మనిషి ఆనందంగా వుండడాన్ని పరవశంతో చూస్తానే, నేను సినిక్‌నంటారేం?" అనుకొంది.

వెనకాతల ఏదో అలికిడి, –దగ్గ– అయింది.

ఒళ్ళు చచ్చిపోయింది శకుంతలకి.

'ఛా. వెధవ పనీ నేనూను! తలుపు కన్నంలోంచి చూడ్డం, ఎవరికో దొరికి పోడమూనూ! నేను లోపల చూస్తున్న దృశ్యం ఎలాటిదో నచ్చచెప్పే అవకాశం యివ్వని ఈ మనుషులు మనుషులా! పురుగులు, కీటకాలుగాని, అవును – సినిక్‌ని, నేను! తిరిగి చూడకూడదనుకుంది శకుంతల. కాని, ఎలా సాధ్యం? ఎవరేనా చూసేరో లేదో అని కుతూహలం లేకపోయినా ఎవరు చూసేరో అని కుతూహలం వుంటుంది కద!

"ఎక్స్‌క్యూజ్మీ- రాజగోపాల్ ఉన్నారండీ?

ఎవరో! – ముప్ఫయ్యేళ్ళుంటాయి; వేలుచూపిస్తూ అడిగాడు. "మరిప్పుడు మీరు తొంగిచూసేరు కదా. లోపల రాజగోపాల్ లేడా!" అని అర్థమైంది. ఆ వేలు చూపించడం శకుంతలకి.

"రాజగోపాల్ ఎవరండి?"

"మీరు–రాజగోపాల్ వైఫ్–?"

"ఇక్కడ కాదండి ... మీరు పొరపాటు పడ్డారనుకుంటాను –"

"మొహంమీద కొట్టాన్లే. నా అవమానం తీరేటట్టు! అనుకున్నాది శకుంతల. "లేకపోతే నేను కన్నంలోంచి చూశానని, ఆ మాట వేలెట్టి చూపించేటంత ప్రైడ్ ఎందుకతనికి?

జేబులోంచి ఒక కాగితం లాగాడు. "ఇదే అడ్రసండి...ఇవాళ వస్తానన్నారండి...సారీ...మళ్ళీ వస్తానండి" అని చకచకా వెళ్ళాడు.

అప్పుడు తిరిగి విజృంభించింది; రాజీ మీద కోపం. కసి – తలుపు దడదడా బాదింది.

"ఒస్తున్నా!" అని రాజీ పరిగెత్తుకొచ్చి ధడాలున తలుపు తీసింది. ఆమె మొహంలో వెయ్యి వాట్ల దీపం వెలిగిపోతున్నది.

"నువ్వేనుటే, తల్లీ. హడలిపోయేను."

"ఏం, మీ ఆయననుకున్నావా?"

అలాటి పరిహాసాలంటే శకుంతలకు మహా చిరాకు. అవే ఆడపిల్లలకి అందం, అలంకారం అనుకొనేవాళ్ళని శకుంతల ఎరుగును. కాని అవే వాళ్ళని ఎదక్కుండా ఛీప్‌గా తయారుచేస్తాయని ఆమెకి కసి – అయినా ఈ బలహీనతకి లొంగిపోయేనే – అని వెంటనే మనసులో తనమీద తనే చిరాకుపడ్డది.

రాజీ మొహం మరింత అందంగా విడింది. "సరిగ్గా వూహించేవే; యూ క్లెవర్ బిచ్!" అని శకుంతల వీపు మీద ఒక్కటిచ్చుకుంది. "ఆయనే వచ్చేరనుకున్నానే...సారీ...కాని...నిజంగా ఆయనే అనుకున్నానే – కారణం యిదీ" అని టేబిలుమీద అప్పుడే పడేసిన కాయితం కళ్ళముందు రెపరెప లాడించింది.

"ఆయనగారి దగ్గర్నించి ఉత్తరం వచ్చిందన్నమాట" – అనుకుంది శకుంతల.

అందుచేత, ఈవిడగారు – ప్రతిపద మిదమపి నిగదతి మాధవ, తవచరణే పతితాహమ్ అని నైట్‌మేర్స్‌లో పడుతున్నదన్నమాట.

"ఆయన కీవూరు ట్రాన్స్ఫరయ్యే అవకాశం కనబడ్డదిట. అదెవరో రాజకీయ నాయకుడితో పరిచయం అయిందిటే...ఆయన చూద్దాం అన్నాట్ట."

"సరేలే – రాజకీయ నాయకుడా! నమ్మిచెడనివారు లేరేతల్లీ! ... నువ్వు విన్లేదా? రాజకీయ నాయకుడు చేద్దాం అంటే చూద్దాం అని అర్థం; చూద్దాం అంటే వీల్లేదు పొమ్మని అర్థం; వీల్లేదు

ని అనేవాడు రాజకీయ నాయకుడే కాదు !'' శకుంతల విరగబడి నవ్వింది. నిమషంనరపాటు సాగిన ఆ విరగబాటు నవ్వుని మర్యాదగా భరించి "నిన్ను ఇందుకే, మనవాళ్ళంతా సినిక్ అంటారే – నువ్వేదీ సవ్యంగా ఆలోచించవు" అన్నది రాజీ.

''ఇంతేనా ! పాత బిరుదే కదా" నవ్వేసింది శకుంతల. సంచి అవీ మంచంమీదపారేసి అవతలకి వెళ్ళింది. సోది మొదలెడుతుంది రాజీ, ఆ మొగుడుగారు, ఆయన అందం చందం; ఆటా పాటా; ముద్దూ ముచ్చట, లలిత కళలయందు, స్త్రీలయందూ ఆయనకు గల ఆసక్తి; అనుకుంటాను. ఇంక సినిమా లేదు. చిత్రమూలం లేదు. బస్సుల్లో చేసిన మోచేతుల యుద్ధం సర్కస్సూ అన్నీ వృథా. 'హాయిగా ఇంటికేనా పోయేను కాదు' అనుకొంది.


రాజీకి పెళ్ళయి ఆర్నెల్లయింది. ఏ ఇరవై రోజులో మహా అయితే ముప్ఫయి రోజులో కలసి వుండుంటారు వాళ్ళు. జులైలో పెళ్ళి కుదురుతుందని తెలియక రాజీ, మే నెలలో వాళ్ళన్నయ్య బెంగుళూరు రమ్మంటే వెళ్ళిపోయి ఉన్న సెలవంతా వాడేసి వచ్చింది. ఆతగాడు లెక్చరరు. సెలవులేగాని, సెలవు దొరకదు. దసరాలకి ఓ మాటూ పండగకి ఓ మాటూ వచ్చాడు. రెండు సార్లూ హైదరాబాదు నగరం చూడ్డానికే సరిపోయింది.

శకుంతల తిరిగి వచ్చేసరికి రాజీ మొహాన పౌడరు మెత్తుకుని "పద" అంది.

"అక్కర్లేదులే నా కెందుకీ పాపం? నేనింటికి పోతాను."

"ఏం పరవాలేదులే, పద"

"అది కాదే తల్లీ- ఎన్నాళ్లయిఎదురు చూస్తున్నావో పాపం" చవక రకం పరిహాసం అనుకుంటూనే ఆడింది శకుంతల.




"ఔను" రాజీ నిండుగా నవ్వింది. "అందుకే నా కోసం ఆయనగారు మరో గంట సేపు ఎదురుచూస్తే ఇంకా బావుంటుంది."

శకుంతలకి ఒక్కర్తే సినిమాకి వెళ్ళి పోవాలన్నంత కసి కలిగింది.

* * *

రాజీ రిక్షా ఎక్కింది.

ఇలా సినిమాలో జనగణమన పాడగానే అలా, ఆనాటి ప్రోగ్రాములకి జనగణమన పాడింది రాజీ. "ఈ బస్సుల కోసం నే నాగలేను బాబూ" అనుకుంటూనూ.

"ఔనౌను నువ్వు ఆగలేవు. నీకంటే ఆగలేడు, ఆ మొగమహారాజు, పారిపో" చవకరకం పరిహాసం అని గుర్తొస్తున్నా సరే, ఆడేసింది శకుంతల.

"ఏమంటే అను గాని; ఇవాళ నువ్వు రోజూ అంత అన్యాయం లేదు. కొంచెం పదును పడ్డాదిమెదడు. హాస్యప్రియత్వం సినికల్ ఔట్లుక్ కాదు." అని మెచ్చుకుంటూ రిక్షాని పొమ్మంది రాజీ

అయిదు నిముషాలయింది. బస్సు రాలేదు. తనూ రిక్షాలో వెళ్ళి పోదామను

కొంటోంది; ఇంతట్లోకే పరిచయం వున్న గొంతుక పలకరించింది "హల్లో పక్షీ!"

"పక్షీ!" ఆపేరు పెట్టి తనని ఒక్కడే పిలవగలడు...అతడే రాజు... పక్షి రాజు.

వచ్చాడా? ఇంత అదృష్టమా, తనకి ఈ వాళ?

ఏళ్ళ తరబడి కనబడక ఎగిరిపోయిన పక్షిరాజు తనని వెతుక్కుంటూ ఈవాళ ఇక్కడి కొచ్చాడా? ఏడీ?

రోడ్డు క్రాస్ చేసుకొని వచ్చాడు రాజు.

"గుడ్‌గాడ్! నువ్వు హైద్రాబాద్‌లో వున్నావా?...నీ ఎడ్రస్ తెలిసి ఐదేళ్లయింది!"

అప్పుడే తనలోకి ప్రవేశించాడు రాజు! ఆ కంఠస్వరంవేరు.

వెయ్యి ప్రతిజ్ఞల బలిమిఒకనిట్టూర్పులోను, వెయ్యి వాగ్దానాల కలిమి వొక్క మాటలోను ఇముడ్చుకోడమే కాక తెలియ జెయ్యటమూ నేర్చిన గాంభీర్యం అది. రెండు చేతులూ పట్టుకుని వూపాడు రాజు.

"నువ్వు, నా పక్షివి కాదా?"

"నే నెవరి పక్షినీ గాదు, వొదులు" అన్న ది శకుంతల, చిరునవ్వు దాచుకో లేకుండా వంపేస్తూ.

"గుడ్ వెరిగుడ్! నీ పార్టీ ఎక్కడికీ పోలేదు, అంటే నువ్వెక్కడికీ పోలే దన్నమాటే—టాక్సీ!"

"టాక్సీ ఎందుకులే—"

"ఎక్కవోయ్...ఇంటి దగ్గిర మీ అమ్మ లేదా?"

"ఉంటే, నిన్నెప్పుడేనా అడ్డిందా?"

"అడ్డనంతవరకు భయపడకూడదు"

"భయం అనకూడదు."

"భయంకాదు. ఔను... ఈ భయానికి పేరు గడుసు తనం."

"అవును, భయం ఒక్కొక్కప్పుడు ఒక్కొక్క రూపంలో ఒక్కొక్క పేరు పెట్టుకొని ఆవేశిస్తుంది.

"వహ్వా... ఇప్పటి భయం ఎలాం టిదో!"

"చాలా చిన్నరకం భయంయిది ... పొద్దున్నే మెలుకువ వస్తుందో రాదో— రేపు ఆఫీసులో అందరి కళ్ళల్లోకీ ఇవాళంత ధైర్యంగా చూడగలుగుతానో లేదో!—అలాగ, ఎందుకులే; నాదార్ని నన్నుపోనీ,"

"నీదార్ని నిన్ను పోనివ్వడమే కాదు నేనూ వస్తాను, కొంతదూరం.అంతే _"

అతను అప్పుడు కూడా యిలాగే—

తనదారిని కొంతదూరం వచ్చేడు... తనకి దగ్గిరగా వచ్చేడు... తనకేవో స్వీట్ నథింగ్స్ గుసగుసలాడి నచ్చజెప్తాడు...వేయి పరాజయాలకు ఒక అభయహస్తం అందిస్తాడు... వేయి అనుమానాలకు ఒకజ్ఞాన కిరణం ప్రసరిస్తాడు...అంతే—ఉన్నట్టుండి మాయమౌతాడు, కాని ఈవాళ—

ఐదేళ్లనుంచీ తను కనిపించడంలేదని విసుక్కున్నాడు. తన గురించి ఎంత మందిని అడిగాడో వాళ్ళందరి పేర్లు లిస్టు ఇచ్చాడు. అవును... వాళ్ళందరూ తనకు కావలసిన వాళ్ళే తన ఎడ్రస్; తను అమ్మతో ఇక్కడి కొచ్చేసిన సంగతి తెలియని వాళ్లే... తెలియ వల సినవాళ్ళే—కాని—

వాళ్ళెందుకు చెప్పలేదు?

"కారణం నువ్వే రాజూ"

"నేనా?"

"అవును— వాళ్లు నన్ను నువ్వు అన్యాయం చేసేవని నన్ను పొడుచుకు తిన్నారు. నిన్ను నేను మోసం చేసేనని మీ వాళ్ళ చెవులు కొరికేరు. నువ్వు అన్యాయం చేసింది నన్నొకతెనే కాదనీ"-

"అన్యాయం—"

"అన్యాయ మేమీ లేదు. ఇంకా నీకు భయపడి నీ మాటలకి తప్పట్లు కొట్టి తాళం వెయ్య మంటావా? ఇంకా నా కుటుంబాన్ని పోషించుకోడానికి నువ్వు డబ్బిస్తావా?"

"పక్షీ!-ఎందుకలా మాట్లాడుతావ్?"

"నువ్వువినడానికి వచ్చేవు కదాఅని- ఇన్నాళ్లు నేనన్నీ మాట్లాడకుండా దాచుకున్నాను కదా!...పాపం; నీ మనస్సు చాలా మెత్తటిది...మంచి మంచి అనుభవాలు జుర్రుకోవడం మటుకే దానికి తెలుసు—ఇలాటి మాటలు జీర్ణం చేసుకోవడం తెలియదు.

"నువ్వు వెళ్ళి పోయావు... మీ నాన్నని అడిగితే ఇంట్లోంచి లేచి పోయాడు; ఎక్కడి కెళ్ళాడో తెలియదని కళ్ళ నీళ్లు పెట్టుకు చెప్పాడు... మరి ప్రతి నెలా నీకు డబ్బు వెళ్తున్నాది కదా...ఇంజ నీరింగులో రెండు మూడు డిగ్రీలు సంపాదించేవు కదా... ఇదంతా నీ రెక్కల కష్టం మీదనే జరిగిందని చెప్పటానికి ఇదే మన్నా ఇంగ్లాండా, అమెరికానా."

"మా వాళ్ళకి నువ్వడిగితే నాఎడ్రస్ ఇవ్వమనే చెప్పేను."

"అవును, చెప్పేవు, కాని నీఅంతట నువ్వు నేనిక్కడున్నానంటూ వొక్క కార్డు రాయలేదు...పైచదువులు పరీక్షలు తీరుబాటు లేదు పాపం...జీవిత మంటే భయం...ఎదిరించే స్వాతంత్ర్యంలేదు" అంది రాజీ అతి సినికల్‌గా కంఠం మార్చి.

"మరి నువ్వెందుకు పారిపోయినట్టు"

"ఆరిపోయిన నిప్పు నుసి లోంచి సెగలు తేవాలని ప్రయత్నించకు. నేను అవమానం నుంచి పారిపోయాను;నువ్వు నిజం నుంచి పారిపోయావు."

"కానీ నీ ఎడ్రస్‌తెలిస్తే రెండేళ్లక్రితం నేను ఎం. ఇ. అయిపోయాక వచ్చేసే వాణ్ణి–నీకు నమ్మకం లేకపోతే నేనేం చేసేది?"

"ఇంకా నయం-కనబడుటలేదు, అని పేపర్లో వెయ్య మన్నావు కాదు,"

"నువ్వు నన్ను అండర్ ఎస్టిమేట్ చేశావు."

"కరెక్టు ఎస్టిమేట్స్ వెయ్యడానికి నేనేమైనా నీలాగ ఇంజనీరింగ్ చదివేనా ?"

"వెటకారంగా మాట్లాడ్డం మానేవు కాదు."

"అదే నా ఊపిరి, ఇప్పుడు."

"నువ్వు గొంతెత్తి పిలిస్తే నేనురాక పోయానా"

"ఇప్పుడైనా మించి పోయింది లేదు. దగ్గరగానే వున్నాను. గొంతెత్తకుండా గుసగుసలాడినా వినిపిస్తుంది,"

"ఇప్పుడు-టైం మించి పోయింది పక్షీ."

"ఎవరో, ఆ విక్టిమ్?"

"ఇది విక్టిమైజేషన్ కాదు. వివాహం"

"సంతోషం—ఇక నువ్వెళ్లొచ్చు."

"నిద్రొస్తోందా?"

"ఇవాళ ఎలాగూనిద్దర్రాదు"

"మరి?"

"మీ మామగారింట్లో గేటు తలుపు వేసేస్తారు."


"మామగార్లేరు—"

"పోనీ లెద్దూ, నేనవన్నీ అడిగేనా? వెళ్ళమంటున్నా నంతే."

"నువ్వెడక్కపోయినా నేను చెప్పక తప్పదు...ఈ ఎడ్రస్‌కి వెళ్ళాలినేను... ఎక్కడుందో ఇక్కణ్ణుంచి ఎలా వెళ్ళాలో చెప్తావా?"

కుతూహలానికి జ్ఞాన, వయో, లింగ భేదాలు లేవు; దాని కుండేవి రెక్కలొక్కటే, "ఓ!"

"తెలుసా,నీకు ఈ ఎడ్రస్?"




"తెలుసు..."

* * *

"రాజీ! ఆఫీసు కొచ్చేవే!"

"ఏం రాకూడదా?"

"నువ్వివాళ ఆఫీసుకి సెలవు పెడతావను కున్నాను."

"రిమార్కు హ్యూమరస్‌గానే వుంది గాని మొహం సినిక్‌లాగే పెట్టేవు" వీపు చరుస్తూ నవ్వింది రాజీ.

"రాత్రి మీ ఆయనరాలేదా?"

"అదే-పాపం-మనం సినిమా కెళ్ళేమని చీటీ చూసుకున్నారా ఒక్కరైనే వస్తానని హాలు దగ్గిరకొచ్చి కలుసుకుందామను కున్నారట. కొంచెంలో మనం తప్పి పోయాం. మనం వెళ్ళిపోయాక అక్కడి కెళ్లారట...

"తరువాత?"

"తరవాతేముంది? నే చెప్పానుగా... ఆయనకేం పోయింది? ఎవరో ఫ్రెండు కనబడిందట."

"ఫ్రెండా? గరల్ ఫ్రెండేనా?"

"కంగారుపడకు—ఆయనగారుచిన్న గోపాల కృష్ణుడు-రోడ్డుమీద వెళుతూ వుంటే ఒక అమ్మాయి కనబడ్డాదిట. తీరా చూస్తే ఒకప్పుడు వాళ్లిద్దరూ."

"అలాంటివికూడా చెబుతారేమిటే, మొగాళ్ళు?"

"ఏమో—నా కెంతోమంది మొగాళ్లని తెలీదు—"

ఊఁ—తరవాత—టఁ?"

"తరవాతేముంది? ఆ పిల్ల ఒక్కర్తీ ఇంటికి వెళుతూవుంటే దిగబెట్టి, కాసేపు మాట్లాడి—"

"తరవాత?"

"తరవాత ఆ తరవాత, అన్నీ అడక్కూడదే పిల్లా! ఏవో లక్ష వుంటాయి. శకుంతలలు వుంటే దుష్యంతుళ్ళూ వుంటారు; గాంధర్వాలు ఉంటాయి... మనం చెయ్యగలిగిం దొక్కటే-క్షమించి వూరు కోడం."

"ఔనౌను; క్షమించాలి..."

"అబ్బ! ఎందుకే, అలా పళ్ళు కొరుకుతూ పొడిపొడిగా మాట్లాడుతావు!"

"నేను సినిక్‌ని కదా మరి!"